

## చీమ చిటుక్కుమన్నా

# అలారం మోగుతుంది..!

- బాంబు పేలుళ్లకు అవకాశం లేకుండా సెన్సర్లు, స్కానర్లు, స్మోక్ డిటెక్టర్‌లు
- అసాంఘిక శక్తులకు నో ఎంట్రీ
- మెట్రోలో అడుగడుగునా గట్టి నిఘా
- ఏ చిన్న ప్రమాదమూ జరగకుండా పటిష్ఠమైన సాంకేతిక భద్రత
- రౌండ్ ద క్లాక్ పర్యవేక్షణ మెట్రో యాజమాన్యం భరోసా





సిటీబ్యూరో, టీమీడియా:

'మెట్రో రైలు..చూడవోతే బాగనే ఉండెటట్టుంది కానీ.. అందుల ఎక్కంగనే డోర్లు మూసుకుంటయంట. ఇంగో స్టేషన్ వచ్చినాంకనే మల్ల తెరుసుకుంటయంట. ఆ గ్యాప్‌ల ఎవడన్న రైల్‌ల బాంబులు పెడితే? మొన్న సికింద్రాబాద్ స్టేషన్‌ల ఆ పాపను పొడిసినట్టు..ఎవడన్న కత్తితోని పొడిస్తే? మధ్యల మంటలు లేస్తే ఎట్ల? ఏం జెయ్యాలే? దిక్కు దారి ఉంటదా?' మెట్రో ప్రయాణంపై సగటు హైదరాబాదీకి వస్తున్న అనుమానాలివి... అయితే... అలాంటి వాటికి తావు లేకుండా.. అసాంఘిక శక్తులు, ఉన్మాదులు, ఉగ్రవాదులు మెట్రో స్టేషన్‌ల వైపు కన్నెత్తి చూసే సాహసం చేయకుండా.. అన్ని రకాలుగా భద్రత పరంగా పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నది మన మెట్రో యాజమాన్యం. తమ భద్రతా వలయాన్ని దాటుకుని చిన్న చీమైనా సరే.. స్టేషన్‌లోకి ప్రవేశించదని.. ఆ స్థాయిలో రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని వివరించింది. ప్రయాణికులకు 'ఆరామ్ కా సఫర్ ' అందించే బాధ్యత తమదని తెలిపింది. కేంద్ర హోంశాఖ దర్శకత్వంలో.. మెట్రో రైలు ప్రాజెక్టులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏకంగా కేంద్ర హోంశాఖయే దృష్టిసారించింది. హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి గతంలో పలు మార్లు ఢిల్లీ వెళ్లి హోంశాఖ అధికారులతో చర్చలు జరిపారు. రైల్వే స్టేషన్లలో, ట్రాక్, ట్రైన్లు, డిపోలను పూర్తిగా సీసీటీవీలతో పటిష్ఠం చేయాలని హోం శాఖ సూచించింది. వాటి ప్రకారం.. అన్ని మెట్రో స్టేషన్లలో సీసీటీవీలు, సెన్సార్లు, అలారమ్‌లు, కాన్‌కోర్స్‌గేట్లు, బ్యాగులు, లగేజీ స్కానర్లు, బిగ్గర్ ఎక్స్‌రే మిషన్లు, ప్లాట్ ఫామ్‌లపై లాక్‌డ్ గేట్స్‌ను ఏర్పాటు చేస్తారు. ప్రతీ స్టేషన్‌లో సెక్యూరిటీ రూమ్‌లు ఏర్పాటు చేస్తారు. వీటన్నింటినీ అనుసంధానం చేయడానికి నియంత్రణ వ్యవస్థను సెంట్రలైజ్‌డ్ చేస్తారు. అన్ని మెట్రో డిపోల్లోఎత్తైన గోడలు, వాచ్‌టవర్స్, 24 గంటల పెట్రోలింగ్‌తో భద్రతను కట్టుదిట్టం చేస్తారు. లోపలికి అడుగు పెట్టాలంటే.. మెటల్ డిటెక్టర్‌లను దాటుకుని మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది.

### అడుగడుగునా చెకింగ్

సాధారణ రైల్వే స్టేషన్‌లలో లాగా యాచకులు, బాలకార్మికులు, అమ్మకపుదారులు, ర్యాగ్‌పిక్కర్లు, మతిస్థిమితం కోల్పోయిన వారు మెట్రో స్టేషన్‌లోకి వచ్చే అవకాశం ఉండదు. స్టేషన్‌లోకి వెళ్లాలంటే భారీ సెక్యూరిటీ సిబ్బందిని దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. ఒక్కో స్టేషన్ భద్రతకు 18 మంది సెక్యూరిటీ గార్డులు చొప్పున 24 గంటల పాటు విధులు నిర్వహిస్తారు. టికెట్, రైల్వేపాస్, స్మార్ట్‌కార్డ్, టోకేన్‌లలో ఏదో ఒకటి ఉంటేనేనే ప్లాట్‌ఫాం మీదికి అనుమతిస్తారు. ప్రయాణికులు స్టేషన్ లోపలికి వెళ్లడానికి ఆటో ఓపెనింగ్ ఆఫ్ టికెటింగ్ గేట్స్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ గేట్లు దాటుకుని వెళ్లాలంటే చాలా కష్టం. టికెట్లు, బయోమెట్రిక్ పాస్‌లు, స్మార్ట్‌కార్డులను స్క్రాచ్ చేస్తేనే గేట్లు తెరుచుకుంటాయి. టికెట్లపై బార్ కోడింగ్ ఉంటుంది. నకిలీ టికెట్లు తయారు చేయడానికి అస్కారం ఉండదు. బార్ కోడ్‌ను స్కానర్లు స్వీకరించి ఓపెన్ అవుతాయి.

### సైబర్ భద్రత

అంతర్గత భద్రతకు మెట్రోలో అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. మెట్రో రైలు ప్రాజెక్ట్ మొత్తం సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్నది కావడంతో సైబర్ సెక్యూరిటీ భద్రత కోసం తగిన ఏర్పాటు చేస్తున్నారు. స్కాడా సిస్టమ్స్ ఏర్పాటు చేసి సాంకేతిక మార్గాలు, కేబుళ్ల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నారు. డాటా ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్, కంట్రోల్, పాస్‌వర్డ్ ప్రొటెక్షన్, సిగ్నలింగ్ వ్యవస్థలు ప్రధానం కావడంతో వీటి పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.




### అగ్ని ప్రమాదాలను తప్పించేందుకు

అగ్ని ప్రమాదాలను తట్టుకునేలా వాటి తాలూకు నష్టం ఎక్కువగా లేకుండా... పూర్తి భద్రతతో కూడి ఫీచర్లు, ఫైర్, స్మోక్ డిటెక్షన్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నారు. స్టెయిన్‌లెస్ స్టీల్, అల్యూమినియంతో కూడిన తక్కువ బరువు రోలింగ్ స్టాక్ బోగీలు తయారు చేస్తున్నారు. అయితే..ఒకవేళ అగ్నిప్రమాదం సంభవించినా వాటిని అరికట్టేందుకు ప్రతీ స్టేషన్లలో ప్రత్యేకంగా... ఎప్పుడూ నీటితో నిండి ఉంటే ప్రత్యేకమైన వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో స్టేషన్ చేరుకోవడానికి మూడు నిమిషాల కంటే ఎక్కువ సమయం పట్టదు కాబట్టి.. పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

### అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట

దుండగులు, తీవ్రవాదులు, అసాంఘిక శక్తులు అసలు స్టేషన్‌లోకి రాకుండా అడుగడుగునా మెటల్ డిటెక్టర్లు... స్కానర్లు... సీసీ కెమెరాలు ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తాయి. అనుమానాస్పద వస్తువులను స్టేషన్‌లోకి తీసుకెళ్లకుండా సెక్యూరిటీ సిబ్బంది నియంత్రిస్తారు. స్టేషన్‌లోకి ప్రవేశించే ముందే ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. బ్యాగులు, లగేజీలను ఎలక్ట్రిక్ స్కానర్లు తనిఖీ చేసిన తర్వాతే మెట్రో స్టేషన్‌లోకి అనుమతిస్తారు. దీంతో మొదటిదశలోనే వీరిని అడ్డుకోవడానికి అవకాశం ఉంటుంది. స్టేషన్ దాటి పట్టాలపై వెళ్లడానికి కూడా అవకాశం ఉండదు. స్టేషన్ చివరి భాగాన్ని పూర్తిగా మూసేస్తారు. దీంతో పట్టాలపైకి వెళ్లే అవకాశాన్ని నియంత్రించినట్లవుతుంది. దీంతో పాటు స్టేషన్లలో, బోగీల్లో సమీప పోలీస్ స్టేషన్, ఫైర్ స్టేషన్ ఫోన్ నెంబర్లను పొందుపరచనున్నారు.






### ఢిల్లీ మెట్రో నుంచి పాఠాలు నేర్చుకుంటున్నాం : ఎన్వీఎస్‌రెడ్డి

హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట్‌ను చేపట్టడంలో ఢిల్లీ మెట్రో నుంచి పాఠాలు నేర్చుకుంటున్నాం. అక్కడ ఎదురైన సమస్యలను అధిగమించడానికి ప్రయత్నిస్తున్నాం. రక్షణ, భద్రతా పరమైన అంశాల్లో ఢిల్లీ మెట్రోను ఆదర్శంగా తీసుకుని ముందడుగువేస్తున్నాం. పోలీసు, ఐబీ, సీఐఎస్ఎఫ్, సిబ్బంది నుంచి సలహాలు కోరుతున్నాం. కేంద్ర హోంశాఖ చేసిన సూచనలను పాటిస్తున్నాం. సీసీటీవీ కెమెరాలు పోలీసుశాఖ కంట్రోల్ సిస్టమ్‌తో అనుసందానం చేస్తు న్నాం. ప్రయాణికులకు పూర్తి స్థాయి భరోసా ఇస్తాం.

